క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో నిర్వహిస్తున్న రోడ్డు వెడల్పు పనుల కారణంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 11గంటల వరకు మిర్యాలగూడ రోడ్డులోగల కలెక్టరేట్ ఏరియా, అలకాపురి కాలనీ, హైటెక్ కాలనీ, మహిళా ప్రాంగణం, క్లాక్ టవర్, సుభాష్‌రోడ్డు, మున్సిపాలిటీ ఆఫీస్, కోర్టు ఏరియా, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

నల్లగొండ క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ శ్రీను అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా, జైలు తప్పదని, మూడోసారి దొరికిన వ్యక్తికి 30 రోజుల జైలు అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మూడోసారి దొరికినందున ఇటీవల 15 మందికి జరిమానా, 30 రోజుల జైలు శిక్ష పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, పీసీలు అహ్మద్ ఇక్బాల్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్ అందజేత


వాటర్ బాటిల్స్ అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని శాలం చర్చిలోని ఒకేషన్ బైబిల్ స్కూల్‌లో రేఖల అన్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్, టీచర్లకు లంచ్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రేఖల భద్రాద్రి సభ్యులు శైలజ, మాధవరావు, హనీ చిన్ను, రేఖల సునీల్, హరిత, మొన్న సౌరబ్, రేఖల వర్షిక తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నల్లగొండ టౌన్ : తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఎమ్మార్పీఎస్ నాయకులను అవమానపర్చేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితబంధు అవినీతిపై ప్రశ్నించినందుకు దళిత న్యాయవాది యుగేందర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు

రామగిరి(నల్లగొండ) : ఇటీవల ప్రకటించిన సివిల్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన నల్లగొండ పట్టణానికి చెందిన దామెర హిమవంశీని నల్లగొండ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో అభినందించారు. నల్లగొండ బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు నేరుగా నగదు

రామగిరి(నల్లగొంగడ) : తపాలా శాఖ ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఇంటి వద్ద నగదు తీసుకునే సౌకర్యం కల్పిస్తున్న నల్లగొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రఘునాథ స్వామి తెలిపారు. శుక్రవారం నుంచి ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా నగదు నేరుగా కూలీలు పని చేసేచోటుకు, ఇంటి వద్దకు వెళ్లి సిబ్బంది ఇస్తారని పేర్కొన్నారు. వేతనాలు పొందేందుకు ఉపాధి హామీ కూలీల ఇబ్బందులు తొలగించేందుకు నల్లగొండ డివిజన్‌లో 359 పోస్టాఫీసుల్లో నగదు తీసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఉపాధి కూలీలు ఐపీపీబీ ఖాతాలు తీసుకోవాలని సూచించారు.

బీసీ బంధు ప్రకటించాలి

మర్రిగూడ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం బీసీ బంధు ప్రకటించాలని బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పగిళ్ల సత్యనారాయణ కోరారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ బీసీల్లో వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం బీసీ బంధు పథకాన్ని ప్రకటించి వారి అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. ఆయన వెంట వెంకటేష్, శ్రీను, యాదయ్య తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కురిమిద్దె కళమ్మ గురువారం ప్రారంభించారు. కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగూరి శ్రీశైలం, శనిగల భార్గవి, మంజుల, వైద్యుడు సంపత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాండు, తిరుమలేష్, పుష్పలత, లోడే యాదయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో గందరగోళం !

- అనుమతులు లేకుండా విగ్రహాలు, డబ్బాల ఏర్పాటు
- చండూరులో పోటాపోటీగా ఆక్రమణలు
- నోటీసులు అందించినా స్పందించని బాధ్యులు
- సతమతమవుతున్న మున్సిపల్ అధికారులు


చండూరు మున్సిపాలిటీ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా, అనుమతులు లేకుండా డబ్బాలు, విగ్రహాలు ఏర్పాటు చేసినా మున్సిపల్ చట్టం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. అనుమతులకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి.

–మొయిజొద్దీన్, మున్సిపల్ కమిషనర్

చండూరు : చండూరు మున్సిపల్ పాలకవర్గంలో కోల్డ్‌వార్ కొనసాగుతోంది. పది మంది వార్డు కౌన్సిలర్లు (చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో సహా) రెండు గ్రూపులుగా విడిపోయి నువ్వా.. నేనా అంటూ ముందుకు సాగుతున్నారు. ఫలితంగా ఏ వర్గం మాట వినాలో తెలియక కొంతకాలంగా మున్సిపల్ అధికారులు సతమతమవుతున్నారు. పాలకవర్గంతో ఇబ్బందులు తట్టుకోలేక ఇప్పటికే ఓ మున్సిపల్ కమిషనర్ బదిలీ చేయించుకోగా, మరో కమిషనర్ లాంగ్ లీవ్‌పై వెళ్ల..నూతనంగా మరో కమిషనర్ విధుల్లో చేరారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకుని మున్సిపాలిటీకి ఆదాయం పెంచాలని ఓ వర్గం అంటుండగా.. తమకు సంబంధించిన వారిని మరో వర్గం పాలకవర్గ సభ్యులు వెనకేసుకుని రావడం చర్చనీయాంశమైంది.

అవిశ్వాసం లేఖతో మొదలై..

చండూరు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని జనవరి నెలలో పాలక వర్గంలో కొంతమంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు లేఖ అందించారు. దీంతో పాలకవర్గం రెండు గ్రూపులుగా విడిపోయారు. ఆనాటి నుంచి నేటివరకు పాలకవర్గ సమావేశంలో ఓ వర్గం ఏదైనా అంటే మరో వర్గం వ్యతిరేకించడం జరుగుతోంది. పాలకవర్గ సమావేశాల్లో తీర్మానాలు ఆమోదించడం అటుంచితే.. మెజార్టీ సభ్యులు వ్యతిరేకించడమే ఎక్కువగా జరుగుతోంది. తాజాగా సీపీఐ నాయకుడు దివంగత వైస్ ఎంపీపీ మండడి నర్సింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు సీపీఐ నాయకులు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు సీపీఐ నాయకులు ప్రయత్నాలు చేస్తుండగా.. ఓ వర్గానికి చెందిన కౌన్సిలర్లు మరొక నాయకుడి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం మొదలుపెట్టారు. ఇదే అదునుగా మరొకరు మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకోవడం, అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటు పనులు మొదలుపెట్టారు. మున్సిపల్ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న బాధ్యులకు నోటీసులు అందించారు. అయితే వారం గడువు దాటిన సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఇక పాలక వర్గంలోని ఓ వర్గానికి చెందినవారు తమ అనుచరులతో కాంప్లెక్స్ ఏర్పాటు చేసే స్థలంలో అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేయించారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ డబ్బాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. అనుమతులు ఎవ్వరు తీసుకోకూడదని..ఎక్కడ పడితే అక్కడ నిర్మాణాలు చేసుకోవచ్చని ఓ కౌన్సిలర్ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేశారు. దీంతో ఏం చేయాలో తోచక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రతిఒక్కరూ దైవభక్తి పెంపొందించుకోవాలి


పిట్టంపల్లిలో పూజలు చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గ, కోటమైసమ్మ, ముత్యాలమ్మ ఆలయాలను ఆయన ప్రారంభించి ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం వరడ గ్రామంలో జరిగిన గ్రామ దేవతల పండుగలో పాల్గొని పూజలు చేసి ఆలయ అభివృద్ధికి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బొల్లేపల్లి జీపీ పరిధి పెరిందేవిగూడెంకు చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పిట్టంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, సర్పంచ్‌లు పనస సైదులు, పుట్ట సృజనవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు పాలడుగు హరికృష్ణ, ఎడ్ల పురుషోత్తంరెడ్డి, చెవుగోని సాయిలు, జానీపాష, మంగదుడ్ల వెంకన్న తదితరులున్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి


సమావేశానికి హాజరైన ఉద్యోగులు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణాచారి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు జరగనున్న దశాబ్ది ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, తాగు నీటి సరఫరా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని విభాగాల నుంచి గత పదేళ్ల నుంచి చేసిన హరితహారం, ఇంజనీరింగ్ విభాగం పనుల వివరాలతో నివేదికలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

27న అంబేద్కర్, పూలే విగ్రహాల ఆవిష్కరణ

కనగల్ : మండల పరిధిలోని దోరెపల్లి గ్రామంలో ఈ నెల 27న అంబేద్కర్, పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయిత గోని యాదయ్యగౌడ్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నేడు బీజేపీ సమావేశం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ నాయకులు, జిల్లా, మండల పదాధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు


శాలిగౌరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

శాలిగౌరారం : జిల్లాలో ఇప్పటివరకు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, కొనుగోలు, రవాణా ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ధాన్యం దిగుమతుల్లో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టామని, వల్లాలలోని పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుకు అదనంగా మరో 30 వేల క్వింటాళ్ల ధాన్యం కేటాయించినట్లు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ప్రస్తుతానికి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు వివరించారు. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 346 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 81 వేల మంది రైతులకు రూ. 800 కోట్లు ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ జావీద్, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, కర్నాటి శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'కేసీఆర్ అవినీతిపై దర్యాప్తు చేయాలి'

నల్లగొండ టూటౌన్ : కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతిపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కాగితాలకే పరిమితమైందని, 50 శాతం కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గత పదేళ్లలో రూ.26 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, అందులో సగం కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరం కూడా నీరు పారలేదని, కమీషన్ల కోసమే ప్రాజెక్టు కట్టారని అన్నారు. దళితబంధులో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ సీజీఎం అమిద్ జింగ్రాన్

చిట్యాల : ఎస్‌బీఐ ద్వారా మహిళలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ సీజీఎం అమీద్ జింగ్రాన్ అన్నారు. చిట్యాల ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన 'సంధ్యా శిబిరం'కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తీసుకున్న పంటల రుణాలను చెల్లించి తిరిగి రిన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అంతేకాకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు పది లక్షల రుణాల నుంచి ఇరవై లక్షల రూపాయల రుణ పరిమితి పెంచినట్లు తెలిపారు. పంటలు, పండ్ల తోటల సాగు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలకు సబ్సిడీపై రుణాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎస్‌బీఐ ద్వారా అందిస్తున్న సేవలను రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సంధ్యా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం దేవాషిష్ మిత్ర, డీజీఎం ప్రశాంత్‌కుమార్, ఏజీఎం మహమ్మద్ అలీయుద్దీన్, నాబార్డు డీజీఎం వినయ్, హార్టికల్చర్ ఆఫీసర్ విద్యాసాగర్, అగ్రికల్చర్ ఏడీ హంస్పేస్‌బాబు, చిట్యాల, ఉరుమడ్ల, యల్లారెడ్డిగూడెం శాఖల ఎస్‌బీఐ మేనేజర్లు డి.సత్యం, ఎం.వంశీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం అందజేయాలి

కేతేపల్లి : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారాన్ని వెంటనే అందజేయాలని టీపీసీసీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 3,321 ఎకరాల్లో పంట నష్టపోయిన 2,667 మంది రైతులకు ఎకరాకు పదివేల రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన నేటికీ అమలు కాలేదన్నారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, బయ్య ముత్తయ్య, దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు


దీక్షలో కూర్చున్న లారీ డ్రైవర్లు, ఓనర్లు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం ముప్పైఐదో రోజు కొనసాగింది. దీక్షలో ఆ గ్రామ లారీ డ్రైవర్లు, ఓనర్లు కూర్చోగా ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు వారికి పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు.

గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన


మాడుగులపల్లి: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా బాధ్యుడు బాణాల రామలింగారెడ్డి కోరారు. గురువారం ఆయన మాడుగులపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీకి పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం, రాష్ట్ర, కేంద్ర నిధుల వివరాలు తెలుసుకునేందుకు ఆర్టీఐ కింద దరఖాస్తు రాగా.. పరిశీలనకు కార్యదర్శి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ


చీరలు అందజేస్తున్న ఇమ్మడి విజయ్‌కుమార్

చిట్యాల : పట్టణానికి చెందిన మాజీ సమితి ప్రెసిడెంట్ ఇమ్మడి నర్సయ్య భార్య రాములమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు విజయ్‌కుమార్ గురువారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న 30 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి కృష్ణమూర్తి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, ఇమ్మడి రమేష్, ఇమ్మడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా వెంకటయ్య



మాడుగులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాడుగులపల్లి మండల అధ్యక్షుడిగా పందిరి వెంటయ్యను నియమిస్తూ ఆ పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిమళ్ల శంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతమ్, వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన అనంతుల శ్రీనివాస్(58) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు శ్రీనివాస్ మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.8వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు ముక్కెర ప్రభాకర్, నరేష్, మల్లయ్య , మహేష్, పోగుల రాజు తదితరులు ఉన్నారు.

అధిక డబ్బులు ఇస్తేనే ధాన్యం రవాణా !

- రైతుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న లారీ డ్రైవర్లు
- తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లిస్తున్న రైతులు
- పలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు


మునుగోడులో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

బస్తాకు రూ.2 ఇస్తేనే తూకం వేశారు



నేను సాగుచేసిన పొలంలో 161 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. రెండు నెలల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే నిన్నటి వరకు కొనుగోలు చేయలేదు. రవాణా చార్జీ బస్తాకు రూ.2 ఇస్తేనే తూకం వేస్తామంటే తప్పనిసరి పరిస్థితిల్లో నిర్వాహకులు అడిగిన డబ్బులు ఇచ్చి తూకం వేయించుకున్నా. అంతే కాకుండా హమాలీ చార్జీ సైతం నా దగ్గర నుంచే తీసుకున్నారు.

–సుంకరబోయిన రాము, కల్వలపల్లి రైతు

మునుగోడు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీ యజమానులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న రవాణా చార్జీలతోపాటు అదనంగా మరో రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు ఇస్తేనే రవాణా చేస్తున్నారు. ధాన్యం రవాణా చేసేందుకు టెండర్ పద్ధతిన ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో లారీ యజమానులు రైతుల నుంచి రెండుమూడు రెట్లు అధికంగా రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. అధికారులు మందలించినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా తమకు ప్రభుత్వం ఇస్తున్న రవాణా చార్జీలతోపాటు రైతులు కూడా డబ్బులు ఇస్తేనే రవాణా చేస్తామని, లేదంటే చేయమని బాహాటంగా చెబుతున్నారు. దీంతో కొందరు రైతులు చేసిది ఏమీ లేక ఎలాగైనా తమ ధాన్యం అమ్ముకునేందుకు లారీ యజమానులు అడిగిన డబ్బులు ఇచ్చి తమ ధాన్యం మిల్లులకు తరలించుకుంటున్నారు. గురువారం మునుగోడు కేంద్రంలో ఒక లారీ ధాన్యం లోడు, కల్వలపల్లి గ్రామంలో ఒక లారీ చొప్పున అధిక డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాతనే లారీలను కొనుగోలు కేంద్రాల నుంచి తరలించారు.

పలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం

మిల్లుల్లో ధాన్యం పేరుకుపోవడంతో మిగిలిన ధాన్యం దిగుమతి చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో కాస్త నెమ్మదిగా స్థలం ఉన్నచోట లారీ నుంచి ధాన్యం దిగుమతి చేస్తున్నారు. దీంతో హమాలీలు ధాన్యం దిగుమతి చేసేందుకు రెండుమూడు రోజుల సమయం పడుతోంది. ఆ రెండు, మూడు రోజుల వెయింటింగ్ చార్జీలు ప్రభుత్వం అందిస్తే తాము రవాణా చేస్తామని, లేదంటే చేయలేమని లారీ యజమానులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో నేటికి మండలంలోని ఊకొండి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో 1120 బస్తాలు, మునుగోడు కేంద్రంలో 25 మంది రైతుల ధాన్యం, కల్వలపల్లి గ్రామంలో 20 మంది రైతుల ధాన్యం, పలివెలలో 35 మంది రైతుల ధాన్యం, కొరటికల్ గ్రామంలో దాదాపు 60 మంది రైతుల ధాన్యం రాశులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ధాన్యం మిల్లులకు సరఫరా చేసేందుకు ఇబ్బందులను తొలగించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వీఓఏలపై ప్రభుత్వం మొండివైఖరి సరికాదు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ

శాలిగౌరారం : వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 39 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 వేల మంది వీఓఏలు పనిచేస్తూ డ్వాక్రా సంఘాల్లోని 40 లక్షల మంది మహిళలకు అనేక సేవలను అందిస్తున్నారన్నారు. వీఓఏల పనికి తగిన వేతనాన్ని ఇవ్వకుండా ప్రభుత్వం రూ. 3900 వేతనాన్ని అందిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. వీఓఏలకు పనికి తగిన వేతనాన్ని అందించడంతోపాటూ ఉద్యోగభద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గుండ్లపల్లి వెంకన్న, వీఓఏలు పాల్గొన్నారు.

30న మాజీ ప్రజాప్రతినిధుల సభ

కట్టంగూర్ : ఈ నెల 30న నల్లగొండలో జరిగే మాజీ ప్రజాప్రతినిధుల సభను జయప్రదం చేయాలని మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరెల్లి రామచంద్రయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముప్పిడి యాదయ్య, గడుసు శంకర్‌రెడ్డి, రెడ్డిపల్లి వెంకటమ్మసాగర్, ఊట్కూరి శంకర్, గజ్జి రవి, గోదల వెంకట్‌రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న బీరెల్లి రామచంద్రయ్య

చెరువు శిఖం ఆక్రమిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ: బఫర్ జోన్, చెరువు శిఖం, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ సబ్ డివిజన్ ఇంజనీర్ జనార్దన్ హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలోని తాళ్లగడ్డ పందిళ్లపల్లి చెరువును ఆయన సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పందిళ్లపల్లి చెరువు ఆక్రమణకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువు శిఖాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బఫర్ జోన్, చెరువు శిఖం, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చట్ట వ్యతిరేకమన్నారు. గతంలో చెరువు శిఖంలో బఫర్ జోన్ 30 మీటర్లు, చెరువు బఫర్ జోన్ 9మీటర్లు ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేశామని గుర్తు చేశారు. తాజాగా జరిగిన ఆక్రమణలను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు.

మహిళా కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్


రావిరాల నరేష్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రావిరాల నరేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన టాక్సిసిటీ ఎవాల్యుయేషన్ ఆఫ్ పార్‌బాయిల్డ్ రైస్ మిల్ ఎఫ్లూయెంట్స్ ఆన్ గ్రోత్ అండ్ ఇన్‌ఫ్లూయెన్స్ ఆన్ బయో కెమికల్ ఇన్ లేబియా రోహిట అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ లభించింది. నరేష్ డాక్టరేట్ సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, లైబ్రేరియన్ సుంకరి రాజారామ్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్జీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ మునీర్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మునీర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, సిబ్బంది అభినందించారు. హిస్టరీ సబ్జెక్టులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సయ్యద్ మునీర్ జిల్లాలో ఉన్న వివిధ గడీల పరిశీలన, వాటిని నిర్మించిన వంశాల చరిత్ర, వాస్తు నిర్మాణంపై పరిశోధనలు చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అభినందించిన వారిలో కళాశాల సిబ్బంది అంతటి శ్రీనివాస్, వైపీఆర్ ప్రసన్నకుమార్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.


డాక్టర్ మునీర్‌ను అభినందిస్తున్న సిబ్బంది